# సింగిల్ పేజీ కథలు

## రైలుపట్టాలు

**విజయవాడలో పోలీసు కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తున్న నేను పండుగకి స్వగ్రామానికి వచ్చి, తిరుగు ప్రయాణంలో నా భార్య శ్రీవిద్య, నా రెండేళ్ల కూతురుని తీసుకుని రైల్వేస్టేషన్‌కి వచ్చాను.**

కౌంటర్ వద్ద టిక్కెట్స్ తీసుకుని రెండవ నెంబరు ఫ్లాట్‌ఫాం మీదకు వెళ్లాం. ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రావటానికి సమయం వుండటం వల్ల అక్కడే వున్న బెంచీ మీద కూర్చున్నాను. శ్రీవిద్య పక్కనున్న ప్రయాణీకులతో ఏదో మాట్లాడుతోంది. పాప బొమ్మతో ఆడుకుంటోంది.

రాబోయే ట్రెయిన్ కోసం తూర్పుదిక్కుగా వున్న రైలుపట్టాల వైపు దీర్ఘంగా చూస్తున్న నాకు జీవితంలో ఎప్పటికీ మరువలేని, నాలుగేళ్ల క్రితం జరిగిన సంఘటనలు కళ్ల ముందు కదలాడాయి.

* * *


ఎన్నో ఏళ్లనుండి రిక్షా లాగుతూ ఆ కష్టంతోనే కుటుంబాన్ని పోషిస్తుండేవాడు నాన్న. కష్టానికి ఆయన ఎప్పుడూ భయపడలేదు. కాకపోతే తన కష్టంలో నా సుఖాన్ని చూడాలనుకున్నాడు. రోజువారీ సంపాదనలో కుటుంబ పోషణ కంటే నా చదువు సంధ్యలకే ఎక్కువ ఖర్చు చేసేవాడు. నాన్న ఆశలు వమ్ముచేయకుండా పట్టుదలతో బాగా చదివి గవర్నమెంట్ ఉద్యోగం సంపాదించాలనుకున్నాను.

రోజులు దొర్లిపోతున్నాయి.

మా కాలేజీలోనే డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న హరిత పరిచయమయింది. ఆమె అందం, మాటలు నన్ను ఎంతగానో ఆకర్షించాయి. మేము ప్రతిరోజూ కాలేజీలో కలుసుకుంటూ మాట్లాడుకునేవాళ్లం. అలా మామధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి, పెళ్లికి దారితీసింది. దీంతో సాఫీగా సాగిపోతున్న రైలు హఠాత్తుగా పట్టాలు తప్పినట్టయింది నా జీవితం.

ప్రేమనే పిచ్చిలో పడి చదువులో గాడి తప్పాను. కన్నవారి ప్రేమాభిమానాలను, బంధువుల మమకారాలను, స్నేహితుల హితబోధను మర్చిపోయాను. ప్రేమే జీవితమనీ, అది లేని జీవితం శూన్యమనీ అనిపించి, ప్రతిక్షణం ఆమె ఊహల్లో గడుపుతూ వుండేవాణ్ణి.

ఒకసారి ధైర్యం చేసి నా ప్రేమ విషయం నాన్నకు చెప్పాను. అందుకాయన సమ్మతించలేదు. ఆమెతో నా పెళ్లి చేయకపోతే చచ్చిపోతానని బెదిరించాను కూడ. నాన్న నాకు ఎన్నోవిధాల నచ్చజెప్పాలని ప్రయత్నించారు. ఆ సమయంలో నాన్న మాటలు చెడ్డగా అనిపించాయి.



హరిత కుటుంబ సభ్యులకు అంగబలం, అర్థబలం బాగా వుండటంతో మంచి హోదాగల సంబంధం చూసి ఆమెకు పెళ్లి చేశారు. ఇష్టం లేకపోయినా తప్పని పరిస్థితులకు ఆమె తల వంచింది.

ఆరోజు నుండి ఆమెతో గడిపిన మధుర స్మృతులను తలచుకుంటూ మనస్తాపానికి గురైన నేను మానసికంగా, శారీరకంగా కృంగిపోయాను. నామీద ఎన్నో ఆశలు పెట్టుకున్న నాన్న, నన్ను చూసి జాలిపడాలో, లేక శిక్ష వేయాలో తెలియని అయోమయ స్థితిలో వుండిపోయాడు. అప్పటికీ నాలో మార్పు తీసుకురావటానికి ఎన్నో ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది.

నాన్న ఆశలను తీర్చలేక, నా ఆశయాలను నెరవేర్చుకోలేక, హరిత ప్రేమను పొందలేని ఈ జీవితం వ్యర్థమని బ్రతుకుపై విరక్తి చెంది, చచ్చిపోవాలని నిశ్చయించుకున్నాను. వెంటనే రైలుపట్టాల మీద అడ్డంగా పడుకున్నాను.

సరిగ్గా రైలు వచ్చే సమయానికి, దారిన పోయే ఓ వ్యక్తి నన్ను చూసి రక్షించాడు. "ప్రతి సమస్యకూ పరిష్కారం చావు కాదు, చచ్చి ఎవరూ ఏమీ సాధించలేరు" అని నన్ను మందలించి, ఇంటి దగ్గర దిగబెట్టి తన దారిన తను పోయాడు. ఈ విషయం తెలిసిన అమ్మానాన్నలు చాలా బాధపడ్డారు. నాన్నగారు చెప్పినట్టు వినాలని అప్పుడే నిర్ణయం తీసుకున్నాను.

ఇక ఆలస్యం చెయ్యకుండా నాన్నగారు నా పెళ్లి ప్రయత్నాలు ప్రారంభించారు. అమ్మాయిని చూడటానికి మా బంధువుల ఇంటికి వెళ్లాం. పెళ్లికూతుర్ని చూసి నేను ఆశ్చర్యపోయాను. నిజం చెప్పాలంటే నేను ప్రేమించిన హరిత కంటే ఆమె చాలా అందంగా వుంది. మారు మాట్లాడకుండా పెళ్లికి ఒప్పుకున్నాను. పెద్దల సమక్షంలో సంప్రదాయబద్ధంగా మా పెళ్లి జరిగింది.

శ్రీమహాలక్ష్మి లాంటి శ్రీవిద్య ఇంట్లో కాలుపెట్టిన వేళావిశేషమో ఏమోగానీ, కొద్దిరోజుల్లో నాకు పోలీసు ఉద్యోగం వచ్చింది. అప్పుడు నాన్నగారి ముఖంలో వెల్లివిరిసిన సంతోషాన్ని చూసి ఎంతో గర్వంగా ఫీలయ్యాను.

అయితే ఆరోజు చచ్చిపోవాలని రైలుపట్టాల మీద పడుకున్నప్పుడు దేవుడిలా వచ్చి నన్ను ఆ వ్యక్తి రక్షించబట్టే, ఈరోజు నేను నా కుటుంబ సభ్యులతో ఇంత ఆనందం అనుభవిస్తున్నాను. ఆయనే లేకుంటే ఈరోజు మా పరిస్థితి వేరేవిధంగా వుండేది. మా కుటుంబమంతా ఆ మహానుభావుడికి కృతజ్ఞులమై వుంటాం.

అందుకే పెద్దలంటారు, ఆవేశంలో వున్నప్పుడు తీసుకునే నిర్ణయాలు సరైనవి కావని. అలాంటి సమయంలో ఆగి ఆలోచించాలి. అప్పుడే సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతాం.

ఆనాటి నుంచి రైలుపట్టాలను చూసినప్పుడల్లా, నాకు గత జ్ఞాపకాలు గుర్తుకువస్తూనే వుంటాయి. ఇంతలో రైలు వచ్చి ఆగేసరికి నా జ్ఞాపకాలు చెదిరిపోయాయి. శ్రీవిద్య, పాపతో కలిసి రైలెక్కాను.

**- బి.సాంబమూర్తి**
**(రామలింగాపురం)**

# అభ్యర్థన

ప్రియమైన రవికి,

**నువ్వు ఇంటికొచ్చి అర్నెల్లు దాటుతోంది. ఇటీవల నువ్వు చదువుతున్న కాలేజీకెళ్లి ఎంక్వయిరీ చెయ్యగా, నువ్వు సినిమా దర్శకుడిగా మారాలని హైదరాబాద్‌కి వెళ్లావని నీ రూమ్మేట్ సుధాకర్ ద్వారా తెలుసుకున్నాను. అతి త్వరలోనే పెద్ద సినిమా దర్శకుడినవుతానని నువ్వు శపథం చేసినట్టు కూడా చెప్పాడు. సంతోషం.**

చిన్న వయసులో నువ్వు స్కూల్లో చదివే రోజుల్లో, నోటు బుక్స్‌లో నువ్వు రాసుకునే చిన్న చిన్న కవితల్ని చూసి, నీలో అంతర్గతంగా ఓ కవి ఉదయిస్తున్నాడని అనుకునేవాణ్ణి. నువ్వు కాలేజీలో చదువుతున్నప్పుడు రాసిన కవితల్ని అచ్చులో చూసి ఆనందించేవాణ్ణి.

చివరి పరీక్షల్ని కూడా లెక్కచెయ్యకుండా రాత్రంతా కూచుని నువ్వు రాసిన నాటకం గుర్తుందా? దాన్ని చదువుతుంటే నీలో ఓ కథారచయిత అదృశ్యంగా నిద్ర లేస్తున్నాడని సంతోషించాను.

నువ్వు సంవత్సరం క్రితం రాసిన 'మార్పు' నాటకం, నిరుద్యోగ పట్టభద్రుల్లో వేళ్లూనుకున్న నిర్వీర్యతనీ, వాళ్లకి అండగా నిలిచిన ఓ యువతి, ఆమె వాళ్లలో నిద్రాణమై వున్న టాలెంట్‌ని గుర్తెరిగేలా చేసి, ఉద్యోగమొక్కటే పట్టభద్రునికి పట్టుగొమ్మ కాదని హృద్యంగా రాశావే... అది స్టేజీ మీద ప్రదర్శిస్తుంటే చూసి పులకించిపోయాను. ఎవరైనా దానిని సినిమాగా తీస్తే, యువతరంగంలో మార్పుకు అది మార్గదర్శి అవుతుందని ఘంటాపథంగా చెప్పగలను.

మీ అక్కయ్య పెళ్లి, తమ్ముడి చదువు, మీ అమ్మ హార్ట్ సర్జరీ, మా అమ్మ కంటి ఆపరేషన్... వీటన్నిటికీ ఆర్థిక వనరులు నేనొక్కడినే సమకూర్చడం శ్రమతో కూడుకున్నదే. అయినా కుటుంబం అన్న తర్వాత



యజమానికి ఇలాంటి సమస్యలు వుండవా? లేకపోతే అది కుటుంబం ఎలా అవుతుంది?

ఇప్పుడు నువ్వు చదువుతున్న బి.ఇ. కంప్లీట్ చేసి ఉద్యోగంలో చేరితే, మరి నీలో వున్న కళాకారుడికి అవార్డులు అందొచ్చేదెప్పుడు? నీ ప్రయత్నాలు నువ్వు చేస్తూ వుండు. నా పూర్తి సహకారం నీకుంటుంది.

* * *

ఇలా అని రాసి, నీకు అండగా వుండాలని నాకూ వుంది.

అయినా... అలా చెయ్యడానికి ఈ మధ్యతరగతి స్కూలు మాస్టారికి మనసొప్పటం లేదు మరి.

చేతికి అందొచ్చిన కొడుకుని ఎదురుగా వుంచుకుని, అన్యుల ముందు నా ఆర్థిక సమస్యల్ని వుంచి అర్థించలేను.

చిన్న వయసులోనే నువ్వీ నిర్ణయం తీసుకుని ఇల్లొదిలి వెళ్లుంటే, నీ ఆశయం నెరవేరేది. నీపై మేము పెంచుకున్న ఆశలు అంతరించిపోయేవి. ఆర్థికంగానూ నష్టపోయేవాళ్లం కాదు.

ఉన్న లోన్లన్నీ పెట్టి నిన్ను చదివించి, అవి చాలక నీ ఇంజనీరింగ్ చదువు కోసం బ్యాంకులో ఎడ్యుకేషన్ లోను పెట్టి, నెలనెలా వడ్డీ కడుతూ నిన్ను చదివించింది ఎందుకు? వృద్ధిలోకొచ్చి ఉద్ధరిస్తావనిగానీ, ఇలా అర్థాంతరంగా నన్ను అప్పుల ఊబిలోకి నెట్టి, నువ్వు ఊహాలోకంలో విహంగంలా ఎగిరిపోవడానికి కాదు.

అలాగని నా కష్టాల్లో నిన్ను పాలుపంచుకోమని అభ్యర్థించడం లేదు. మేజర్‌వి నువ్వు. నీ జీవితం నీ ఇష్టం వచ్చినట్టు మలచుకో. అభ్యంతరం లేదు.

కానీ నీ చదువు కోసం చేసిన అప్పులు, బ్యాంకులో తీసుకున్న ఎడ్యుకేషన్ లోను నేనే తీర్చాలంటే, పెళ్లికెదిగిన నా పెద్దకూతురికి పెళ్లి చేసి తరలించడం నాకు కష్టం.

అందుకే... ఈ ఋణగ్రస్తుణ్ణి, ఋణవిముక్తుణ్ణి చెయ్యమని అభ్యర్థిస్తున్నా... అది నీ బాధ్యత అని గుర్తుచేస్తున్నా...

ఎందుకంటే... నేను నీకు జన్మనిచ్చిన మధ్యతరగతి తండ్రిని గనక...

-ఇట్లు,
ఓ మధ్యతరగతి తండ్రి.

**- ఎం.వెంకటేశ్వరరావు**
**(సికింద్రాబాద్)**